'తనను గురించిన నిజం'

"నే నెందుకు మంచివాణ్ణిగా ఉండాలి" అని భార్యని కసురుకున్నాడు రామ్మూర్తి. ఆ ప్రశ్నతో శాంతమ్మ ప్రశాంత జీవితంలో తుఫాను చెలరేగిందనొచ్చు.

ఇంతకీ తానుచేసిన అపరాధం ఏమిటి? బెల్లం కలిపిన కాఫీ ఇచ్చింది. భర్త కాఫీ తాగింతర్వాత "ఇది నాలుగో మాసం" అన్నది అంతే....

ఈ మాత్రానికి భర్తచేసిన వింత వ్యాఖ్యానం వితర్కించుకోడం కోసం, పెద్దబ్బాయి 'రఘు'తో వంటింట్లోకెళ్ళింది. శాంత ముగ్గురు పిల్లల తల్లి; మొగపిల్లలే. పెద్దాడిముందు అల్లా విసుక్కోడంలో అర్థమేమిటి? వాడి కింకా తొమ్మిదో ఏడే. ఐనా ఏమనుకుంటాడు? ఏమిటి మంచితనం? చేసుకున్న పెళ్ళానికీ, కన్నపిల్లలకీ ఇంత కూడెట్టడమేనా? ముందుంది ముసళ్ళపండగ. ఈసారి ఆడపిల్లైతే మరీను. అబ్బాయిల "సత్తుకు" లున్నాయి. బెల్లంకూడా లేని కాఫీ మహారాజులా తాగలా? సంసారంలో ఎన్నెన్నో చిక్కులు, ఇబ్బందులూ ఉంటాయి. దగ్గర దగ్గరగా ఇరవై ఏళ్ళనుంచి సాగుతున్న కాపురంలో ఎన్నో అవాంతరాలు సంభవించాయి. వాటన్నింటినీ సర్దుకుపోలా? ఎప్పుడేనా ఇలా విసుక్కున్నారా? ఐనా, ఎందుకు మంచివానిగా ఉండడమేమిటి నా తలకాయ....! హాల్లో అద్దంలో తన మొహం చూసుకుంది శాంత. ఏదో భావం స్ఫురించినట్లు చిరునవ్వుతో

పెదవి వొంపు తిరిగింది. ఆ నవ్వు మాయమవకుండానే భర్త దగ్గరకెళ్ళి "ఒకవేళ మూడో మాసమేనేమో లెండి" అంది.

రామ్మూర్తి మాట దిగమింగేసుకొని, ముందు గదిలో కెళ్ళి, పేపరు చదవడానికి యత్నం మొదలెట్టాడు. ఇందాక దిగమింగినమాటని పైకను కొని విన్నాడు. "ఇంకెంత కాలం మంచిగా వుండటం? మూడో మాస మైతే ఇంకా ఏడు నెలలా? బల్లమీద అద్దంలో మొహం చూచు కున్నాడు. కళ్ళకింద గీట్లు స్ఫుటంగా కనబడుతున్నాయి. తల్లో నెరుస్తున్న వెంట్రుకల సంఖ్య పెరుగుతోంది. రెండు మూడు రోజులదాకా క్షురకర్మ చేసుకోకుండా వుండడానికి వీల్లేదు. లెక్కకి పదహారు తెల్ల వెంట్రుకలు గడ్డంకింద, మళ్ళా జాగ్రత్తగా లెక్కపెట్టాడు; పందొమ్మిది చూపినకొద్దీ అల్లా కనిపిస్తూనే వుంటాయి. రెండోవాడు 'సేతు' బల్లకింద సిరాబుడ్డితో ఆడుకుంటున్నాడు. ఇదిగో ఈ పిల్లలే కారణం. సంతానం కలిగినప్పుడల్లా ఐదేసి నెరిసిన వెంట్రుకలు. సిరాబుడ్డి లాక్కొని, 'సేతు' వీపుమీద ఒక్క చరుపు చరిచి తోసేసి, తలుపు గడియపెట్టి, రామ్మూర్తి తన నిజస్వరూ పంతో పెనుగులాట సాగించాడు.

రెండు మూడు నెలలనుంచి, మహత్తరమైన మానసిక శక్తులతో భర్త పెనుగులాడుతున్న సంగతి శాంత తెలుసుకోలేదు.

అహం తాండవించే స్మశానవాటిక అతని హృదయం. తీరని కోరి కలు కళేబరాలు; సాధ్యంకాని ఆదర్శాలు మంటలు; శరీరంలో యింద్రి యాలు కుంగదీసిన అహం ఏడ్చి ఏడ్చి సిరైన కలలనే నేతిని కళేబరాల మీదవేసి, ఎండిన తృష్ణ అనే కాగడాతో నిప్పు పెడుతుంది. వాటి ఆత్మ లన్నీ నుసిగా చీకటి విశ్వంలో మరో శరీరాన్ని వెదుక్కుంటూ పరిభ్రమి స్తున్నాయి. తనలోంచే ఆ కొత్త శరీరాన్ని సృష్టించుకోవాలి. దాని సృష్టి కోసమే యీ పెనుగులాట.

రామ్మూర్తికి నలభయ్యో సంవత్సరం వొస్తోంది. సంసారానికి

అతన్ని కట్టిపడేసిన సంకెళ్ళు తెగాయి. సంఘానికి అర్థమయ్యే గౌరవమైన భావాలపై అతనికి గురితప్పింది. కుటుంబ మర్యాద, గౌరవమైన భాష అలవాటు తప్పి హాస్యాస్పదంగా కనబడసాగాయి. అతనికి అంతర్యంలో కలిగిన చాంచల్యం—ప్రజాస్వామ్య రాజ్యాంగంపై వ్యక్తిత్వం చేసిన తిరుగుబాటు — అనాదినుండీ కళలూ, సంస్కృతులూ దేనికోసం ప్రార్థిస్తున్నాయో అది అతనిలో అవతరించింది. మతానికీ, సాంప్రదాయానికీ, కట్టుబాట్లకీ, నియమాలకీ లొంగని వ్యక్తిత్వ ప్రకర్ష. అసలదేమిటో తెలుసుకుంటే దానిని జయించినట్లే.

ఈ మార్పుకి కారణం కొంతవరకు శారీరకమే. గతించిపోతున్న యౌవనానికి శరీరం ఇచ్చే వీడ్కోలు తాలూకు కోలాహలం. ఆరిపోయ్యే ముందు ప్రజ్వరిల్లిన మంటలాంటిది ఆ అనుభవం. జీవితం పాదాలకింద నుండి జారిపోతున్నట్లు ఏదో భయం. ఇల్లు, ఉద్యోగం, పిల్లలు, తిండి, నిద్ర—ఇంతేనా ఇంకేమీ జరగదు? తన ఉనికిని సంఘం గుర్తించినట్టు నిర్ధారణ లేదు. పిల్లల ద్వారా భార్య పరిపూర్ణత చెందొచ్చు. నిర్ధారణ చేసుకోవొచ్చు. తన కది చాలదు. పిల్లలు తన జీవితంలో ఆహ్లాదకరమైన మార్పును తీసుకురాలేదు. పైగా ముగ్గురూ వాళ్ళమ్మ పోలికే—శాంత అనాకారి కాదు. ఐనా ఆడపిల్లలుండి వాళ్ళకి ఆమె పోలిక వస్తే, అందంగా వుండి వుందురేమో....ప్రస్తుతం అతనికి వార్థక్యాన్ని మాత్రం సమకూర్చారు పిల్లలు. ఇంక ఆరునెలల్లో అతను వృద్ధుడన్నమాటే! అతని యవ్వనం ముగిసిందని సంతానం చాటింపు వేసింది.

రామ్మూర్తి చిన్నతనంలో ఎన్నో మధురమైన కలలు కన్నాడు. పాశ్చాత్య విద్యాసంపర్కంవల్ల అతనిలో విప్లవపూరితమైన భావా లుద్భవించాయి. పెండ్లి, ప్రేమ, సంతానం వీటిని గురించిన ఆధునికతత్వం

ఈనాటికి కలవరపరచసాగించింది. సంప్రదాయం నీడలో, పెద్దల చెప్పుచేతల్లో సమాజం పాతిన వేళ్ళ లేతచిగురువలె పెరిగాడు. చదువు కున్నాడు. అందరికి మల్లేనే పెండ్లి చేసుకున్నాడు. అందులో ప్రేమకి స్థానం లేదు.

శాంత ప్రేమను గురించి ఎప్పుడేనా మాట్లాడిందా? శాంత ప్రేమించడమన్న భావమే హాస్యాస్పదంగా తోస్తుంది. పెరిగిపోతున్న జనాభా సమస్య మరిచిపోయి అందరిలాగే పిల్లల్ని కన్నాడు. కళాతృష్ణ, కార్యసాఫల్యత, అన్వేషణ, సంస్కారారాధన—అన్నీ మంటగలిసినై. జీవితంలో ఔన్నత్యం, నూతనత్వం, ప్రతిభ—ఏవీ లేవు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో పౌరుడల్లే అతనొక సామాన్యమానవుడై కనీసపు హక్కుల కోసం పెనుగులాట మాని పెద్దలాదేశించిన బాధ్యతల్ని నిర్వహించుకునే గతిపట్టింది. ప్రజాస్వామ్యం పేలవంగా తయారవగలదని అతనే నిదర్శనం.

రామ్మూర్తి హృదయంలో కలిగిన ఈ పరివర్తనని జాత్యజీవిత ప్రకర్ష అనొచ్చు. కొందరి కిది అరవయ్యో ఏట సంభవించొచ్చు. మరి కొందరికిది నలభయ్యోఏట జరగొచ్చు. అవుతే, ఈ పరివర్తన అందరికీ కలుగుతుందా అంటే చెప్పలేం. బహిర్గతంగా ఋజువు కాకపోవచ్చు అందరిలోనూ. పెండ్లి చేసుకున్న వారందరూ ప్రేమని పొందగలిగారా? తన మట్టుకు తను—స్త్రీ కోసం వివాహాన్ని అంగీకరించాడని వొప్పుకోక తప్పదు. కోర్కెల్ని సాధించలేని వారందరూ విషాద జీవులయి, కళాకన్య ముసుగు తొలగించి, కన్నీటిని స్పృశించి తేటపడిన చూపువెలుగులో అమరజీవులుగానో, సన్నగిలిన వెలుగులో అనామకులుగానో కాలవాహినిలో కలిసిపోతున్నారు. వీరివి నశింపైన జీవితాలు; కొందరికి అట్లా నశింపు కావడమే జీవిత పరమావధి. రామ్మూర్తి చెడ్డవాడై నశించి, రెండో దశకి అనువైన వ్యక్తిత్వాన్ని సృష్టించి, నిజమైన మంచివాడు కావడానికి సమకట్టాడు.

తనమీద విసుక్కున్న నెలరోజులకే ఈ మార్పు నిదర్శనాలు, శాంతికి దొరకడం మొదలెట్టాయి. ఆ రోజున రామ్మూర్తి ఇంట్లో లేడు. కాంప్ వెళ్ళాడు. పోస్టు బంట్రోతు కవరు తెచ్చాడు. అది రామ్మూర్తికే. ఆమె తీసుకుని బల్లమీద పెట్టింది. సాయంత్రానికి, మూడో కుర్రాడు 'గోపి' యథాప్రకారం విధ్వంసకయజ్ఞం సాగించాడు. వాడి దృష్టికి గోచరం కాని వస్తువులు కొద్ది. ఈ కవరు వాడి సిద్ధహస్తాల్లో పడి నశింపు కాబోయే అవస్థలో శాంత దాన్ని లాక్కుంది. లోపల ఉత్తరం తెలుగులో ఉంది. అడ్రెసు, తేదీ లేవు. శాంతికి నాగరికతత్వం తెలియదు. ఉత్తరం చదవడం తప్పనుకోదు. భర్త ఆ చర్యని ఆమోదిస్తాడు కూడా. వారి అన్యోన్యానికి అదొక చిహ్నం.

"ప్రియమైన మూర్తీ—ఎంతో సాహసం చేసి ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. నీకు భార్యా, పిల్లలు వుండడంవల్ల నేనింతవరకూ తెగించలేకపోయాను. జీవితం గతించిపోతూ ఎప్పుడో అప్పుడు తెగించి దౌర్జన్యం చెయ్యాలికదా....ఇంతవరకూ అణిగి ఉండగలగడమే మనం సంఘం కోసం చెయ్యగలిగిన త్యాగం. నువ్వు నన్ను ప్రేమిస్తున్న విషయం ఏనాడో తెలుసు. కాని నా విషయం నీకంతగా తెలియదనుకుంటాను. స్త్రీ అన్వేషించదు. తలుపుసందున చూస్తూ నిరంతరం వేచి ఉంటుంది. తలుపు తోసి నువ్వు లోపలి కొచ్చావు. నేను గడపదాటక తప్పింది కాదు. ఎప్పుడో నన్ను ఏకాంతంలోకి తీసుకెడతావని ఆశిస్తున్నా. జవాబు కోసం నేను కాచుకోను. నాకు ఉత్తరాలెందుకు ? కావాల్సిందేమిటో నీకే తెలుసు —

నీ ప్రియభారతి.'

ఈ 'ప్రియభారతి' ఎవరా అని శాంతమ్మ క్షణం ఆలోచించింది. ఈ ఇరవై సంవత్సరాల్లోనూ భారతి అన్న వ్యక్తిగాని, పేరుగాని వారి జీవితంలోకి రాలేదు. ఆశ్చర్యంతో వొక్కసారి ఆమె కళ్ళు తళుక్కుమని మెరిశాయి. కనుబొమ్మల కదలింపులో సర్దుకుంది.

రామ్మూర్తి కాంప్‌నుంచి ఇంటికి రాగానే, చించిన కవర్ను గురించి అడిగాడు.

"అబ్బాయి చింపబోతుంటే తీశాను" అన్నది శాంత.

"చదివావా ?"

"ఆఁ"—అని శాంత ఇంట్లో కెళ్ళింది.

తర్వాత ఆ ఉత్తరం విషయం ఎవరూ ప్రస్తావించుకోలేదు.

మరో రెండు వారాలు గడిచింతర్వాత, మంచం కింద వూడుస్తుంటే పనిపిల్లకి మరో ఉత్తరం దొరికింది. తీసుకెళ్ళి శాంతమ్మగారి కిచ్చింది.

"నువ్వు ఎప్పుడూ సుకుమారుడివిగానే కనిపిస్తావు. వయసులో నువ్వు పెద్దయినా, నీ హృదయంలో పసిపాప—లాలించబుద్దేస్తుంది. వయసు ముదిరిన కొద్దీ మనసు లేతదవుతుందనుకొంటాను; వార్ధక్యంలో పండి, పండులా రాలిపోతుంది. అప్పటికి నా జడలో పువ్వు వాడిపోతుంది. పండు, పువ్వురాలి మోడు మిగుల్తుంది. ఆ మోడు నీ భార్య, కొమ్మలు నీ సంతానం.

నీ ప్రియభారతి.'

శాంత ఆ ఉత్తరం మడిచి, భర్త కిచ్చేసింది. "ఏదో కాగితం, మీదే ననుకుంటా" అన్నది.

"అవునవును" అంటూ రామ్మూర్తి ఆతృతతో తీసుకున్నాడు. ఎవరూ, ఏమీ మాట్లాడలేదు.

నెల గడిచింతర్వాత 'రఘు' స్కూలు పుస్తకాలు సర్దుకుంటుంటే మరో ఉత్తరం దొరికింది. చదవబొయ్యాడు; భయపడి మానేసి, తీసుకెళ్ళి అమ్మకిచ్చాడు రఘు.

"ఏమిటే అమ్మా ఉత్తరం ?"

"ఏవో వారి ఆఫీసు కాగితాల్లే."

"అల్లా లేదే."

"నీ మొహం."

"కాదే—ఎవరో వొకావిడ రాసినట్లుంచే...."

"స్వరాజ్యమొచ్చింది కాదుట్రా. ఆడవాళ్ళు కూడా వ్యవహారాలు స్వంతంగా చూసుకుంటారమ్మా...."

"నాన్నని అడగనా?"

"ఎందుకూ, ఆయనే అడుగుతార్లే."

రఘు స్కూలుకెళ్లాడు. శాంత ఆ ఉత్తరం చదివింది.

"మీ భార్య చాలా అమాయకురాలనీ, మంచిదనీ వింటాను. నన్ను హర్షిస్తుం దనుకుంటాను. నిజంగా అట్లా జరిగితే మన కింకేం కావాలి?—మన కలలన్నీ యథార్థా లవుతాయి. ఎంతటి దుర్భర జీవితాన్నయినా మీ కోసం హర్షించగలను. ప్రేమ చూపలేని ఓర్పు, సాధించలేని కార్యం ఏముంది? రాత్రి కలలో కారిన కన్నీటితో దిండు తడిసింది. జడలో పుష్పం సిగ్గుతో ముడుచుకొని మొగ్గయింది. మీరు కోస్తూనే వికసించడం....

మీ ప్రియభారతి."

భద్రంగా ఈ ఉత్తరాన్ని మడిచి భర్త బల్లమీదపెట్టి, ఎగిరి పోకుండా పేపర్ వెయిట్ వుంచింది శాంత.

రెండో నెల పూర్తయేసరికి, నాలుగో ఉత్తరం కూడా వంటింటి గుమ్మం ముందే దొరికింది. అప్పుడు రామ్మూర్తి ఇంట్లోనే ఉన్నాడు. ఇల్లంతా దేనికోసమో వెదుకుతున్నట్లు గాలిస్తున్నాడు కూడా. 'ఇక్కడ కొన్ని కాగితా లుండాలి-ఎవరేనా చూశారా?" అన్నాడు.

"ఏం కాగితాలు నాన్నా?" అన్నాడు రెండోవాడు సేతు.

"ఇదేనా?" అంటూనే శాంత, గుమ్మంముందు పడివున్న ఉత్తరం తీసి మడిచి భర్త కిచ్చింది.

"ఆ—ఇదే, ఇదే" అని దాన్ని తీసుకుని రామ్మూర్తి వెళ్ళి పోయాడు.

ఆ రాత్రంతా రామ్మూర్తికి నిద్రపట్టలేదు. డాబామీద వెన్నెల విర్ర వీగినట్లు పడింది. లేచి వెళ్లాడు. రాత్రి పన్నెండు దాటింది. ఈనాటికి తన భార్య పరాయి స్త్రీగా కనబడసాగింది.

ఆమెతో గడిపిన ఇరవై ఏళ్ళలోనూ స్త్రీ మనస్సు తెలుసుకోడం కష్టమన్న లోకోక్తి ఒట్టిదని ఋజువు చేసుకున్నాడు. ఏ క్షణాన, ఏ సందర్భంలో తన భార్య ఏం మాట్లాడుతుందో, ఏమనుకుంటుందో, ఏం చేస్తుందో కూడా తను వూహించి నిర్ణయించగలడు. అతను అనుకున్నలా జరిగేది కూడా. అంత బాగా ఒకరి మనస్సు ఒకరు తెలుసుకో గలగడం అన్యోన్యానికి ముప్పే కావచ్చు. అది వేరే విషయం. స్త్రీ హృదయంలో రహస్య మందిరాలు లేవని తెలుసుకోవడంలో శృంగారమయ జగత్తుపై మమకారం క్షీణించింది.

కాని ఈ రాత్రి తనకి తన భార్యని గురించి ఏమీ తెలీదని ఒప్పుకో వల్సి వొచ్చినందుకు విచారిస్తున్నాడు. రహస్య మందిరంలో తను వొస్తువులమీది దుమ్ము, బూజు దులిపాడు. కాని ఏ వస్తువుకీ మెరుగు పెట్టలేదు.

స్త్రీకి అసూయ మెండంటారు. తన భార్య కొంచెమైనా అసూయ కనపర్చదేం? పోనీ, అసూయక్కర్లేదు. కుతూహలం కనబర్చి "ఎవరండీ, ఈ ప్రియభారతి అనే మహా ఇల్లాలు?" అనేనా అడగొచ్చుగా. నాలుగు ఉత్తరాలు శాంతలో ఏ మార్పూ తీసుకురాలేదు. మాట, వైఖరి, చేష్ట అన్నింటిలోనూ ఎప్పటిలాగే ఉంది. శాంతలో ఆధునిక తత్వానికి సంబంధించిన సంస్కారం లేదు. ఉన్నతాదర్శాలు, ఉజ్వల భావాలు కనబడవు. 'ఇది మూడో మాసం'—అన్నది ఆమె చెయ్యగల కోమల కవితా గానం. ఆమె పూర్వకాలపు స్త్రీ. యుగయుగాల పవిత్రతతో పరిపూర్ణత చెంది భరతమాత జడలోంచి వాడి విడిపోయిన పుష్పం.

పోనీ, తన భార్యతో 'ప్రియభారతి' విషయం ప్రస్తావిస్తే? 'కాసేపు

అసూయ ప్రకటిద్దూ' అని తనే భార్యను కోరడమా! ఓవేళ భారతి అభిప్రాయాలు, ఆశయాలు తనకేమీ పట్టలేదేమో? ఒక స్త్రీకి అవతల స్త్రీ ఏమనుకుంటున్నదీ అక్కర్లేదేమో....? ఆమె క్కావల్సింది తన భర్త ఏమనుకుంటున్నాడు—అన్న వాక్కుటేనేమో....!

ప్రియభారతి వ్రాసినట్లుగా తనే ఎడమచేత్తో ఆ ఉత్తరాలు నాలుగూ వ్రాశాడు. ఇప్పుడు వాటికి సమాధానంగా తనే కుడిచేత్తో వ్రాసి, తన భార్య కంటపడేటట్లు చేస్తే....? 'ప్రియభారతి'ని కవితా కన్యగా సృష్టించుకున్నాడు రామ్మూర్తి. ఆమెచేత మాట్లాడించాడు. ప్రేమింపబడ్డాడు. ఇహ ఆమెతో విహరించాలి. ఆమె ఎట్లా ఉంటుంది?

నేటి ప్రపంచంలో ఆదర్శమైన సౌందర్యాన్ని విడమర్చి చూస్తే, సుప్రసిద్ధ ఫిలింతారలు, పుస్తకాలలో నాయికలు, పత్రికలలో అడ్వర్టైజ్మెంటు చిత్రాలు ప్రత్యక్షమవుతాయి. అనేకమైన అందాలని గుణిస్తే, పరిపూర్ణ సౌందర్యం సిద్ధించదు. ప్రత్యేకత, అందంలోని ప్రత్యేకత. కోలమొహం, తీర్చిన సన్నని పొడుగాటి కళ్ళు, పల్చటి ముక్కు, అమాయకంగా ముడుచుకున్న పెదవులు. ప్రాణం తెచ్చుకున్న గడ్డిపోచలా సుకుమారమైన శరీరం-ఆకలి దప్పులు లేని అయోమయపు ఆశ, దారుణా లెరుగని దైవత్వం, హద్దులులేని అనుభవం—ఆమె 'ప్రియభారతి'.

తను కొంపతీసి నిజంగా కవినేనేమో అన్న అనుమానం కలిగింది రామ్మూర్తికి. ఎందుకు కాకూడదూ? కవిత్వం నేర్చుకుంటే వొస్తుందా? అదొక ప్రవాహం, సుడిగాలి, జలపాతం, పేలి ద్రవించిన అగ్నిపర్వతం. నలుగురి ముందూ బహిరంగంగా చెబితే అర్థంకాని రహస్యం, వ్యావహారికంగా బైటబడని సత్యం—నేటి సమాజం హేళన చేస్తుందని భయపడి బైటపడని అందమైన బాధ - కవిత్వం.

ప్రియభారతి సృష్టిలో లేదు. నీలో సౌందర్యం అంతటినీ ఆమెకీ ఆపాదింపవొచ్చు; నీ అబద్ధపు బ్రతుకు నంతటినీ ఆమెలో యథార్థం చేసు

కోవచ్చు. నీ రహస్య భావాలని ఆమె చుట్టూ విహరింప చెయ్యవచ్చు. పేలవంగా నిర్జీవంగా ఉన్న తన జీవితంలో అలజడి, చాంచల్యం కోరు తున్నాడు రామ్మూర్తి. వార్తాపత్రిక, తను ఆడని పోటీ ఆటలు చూడ్డం, సినిమాలు, పగటికలలు ఇవి మిగిలాయి ప్రజాస్వామ్యంలో సామాన్య మానవుడికి. ఇవి తృప్తినివ్వలేవు. ప్రియభారతి అతని పగటికలల చీకటి కాంత. ఆమెను అన్వేషించి తెలుసుకోడంలో తనని తానే తెలుసుకుంటు న్నాడు. అదే కళాజీవితపు పరమావధి. సామాన్య మానవు లందరూ తలో చీకటి కన్యనీ ఆరాధిస్తున్నారు. ఒకరి కొకరు అర్థంకారు. "నన్ను చూడండి" అని రోదిస్తూ వింత దుస్తులు ధరించి వికృత సౌందర్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ చీకటి కన్యకాములు—ఆధునిక కళాకారులు. నేటి కళలో సౌందర్య శూన్యతకీ, అర్థవిహీనతకీ, అగమ్యగోచరమైన రీతులకీ, అరాజక దృక్పథానికీ ఇదే కారణం కాబోలు! ఎవరి కళాసృష్టిద్వారా వారు తమ నిజస్వరూపాన్ని తెలుసుకోవడం, వీరి ఆధ్యాత్మిక జీవిత సౌధానికి ప్రథమ సోపానం.

ప్రియభారతికి రామ్మూర్తికి వ్రాసిన ఉత్తరంలో తన్ని గురించి నిజం చెప్పేసుకున్నాడు. ఇదీ ఉత్తరం—

"ఇన్నాళ్ళకు తెగించి నువ్వు చేసిన సాహసానికి కృతజ్ఞుణ్ని. నువ్వు సాహసం చెయ్యగలవన్న ధీమాయే నన్ను నీకు దాసుణ్ణిగా చేసింది. భార్య, పిల్లల్ని గురించి ఆలోచింపక పోలేదు. మానసికంగా ప్రతి వ్యక్తి స్వేచ్ఛాజీవి, అరాజకుడు. సంసారం సంకెళ్ళు భౌతికంగా నన్ను సంఘా నికి కట్టిపడేశాయి. ఈనాటికి నువ్వు వాటిని తెంపావు. నేను నిన్ను ప్రేమించలేను. ప్రేమించడం మరిచిపోయాను. నువ్వు నేర్పాలి. నీ ప్రేమతో నా హృదయం వికసించి పెరిగింది, నువ్వు దూరమైనకొద్దీ, రేకులుగా ఇంద్రియాలు విడిపోయి, మొండి శరీరం మిగులుతుంది. దాన్నిండా సంసారం ముళ్ళు. ఏ పక్షి గూడు కట్టలేదు. మృత్యుదేవత దృష్టిలోకూడా పడని ఏకాంతజీవి—ఆ చెట్టు, నేనే.

ఇందులో భార్యకి ద్రోహం చేస్తున్నా ననుకోను. అనేకమంది పిల్లలు కలిగి, నడివయస్సులో వున్న కుటుంబీకుడు ఏ కారుకిందో పడి అకాలమరణానికి గురై, భార్యాపిల్లల్ని నిరాధారుల్ని చేసినప్పుడు ఆ వ్యక్తిని ద్రోహిగా పరిగణిస్తున్నామా? ప్రేమరథం కిందపడి హతుడైనా అంతేనంటాను. ఈ అవాంతరాలకి ఎవ్వరూ బాధ్యులు కారు. జననం, ప్రేమ, మరణం—ఇవి జరుగుతాయి: అంతే.

ఇన్నాళ్ళు ఏకపత్నీవ్రతుడుగా వుండడం చాలా శ్రమ. ఉన్నాను: అదీ త్యాగమే. పురుషులు, స్త్రీలు ఏ వొక్కరితోనో వుండగలిగే అలవాటు అలవర్చుకున్నా, స్వభావసిద్ధంగా వారు బహువాంఛాప్రేరితులు. ఒకరితో వునికి, అనేకులతో విహారం ఇది మానవుడి సహజ ప్రవర్తన. రేపు మనం అంతే· ఈ యధార్థాన్ని ఎదుర్కొని, ఈనాడు ప్రేమజ్వాలలో వశింపు కావడంకంటే వేరే పరిపూర్ణత లేదు.

నేను నిజంగా మంచివాణ్ణే కాని మంచివాడి మంచితనాన్ని ఎవరూ గమనించరు. ఈ వయస్సులో ఈ విధంగా ఒక మహత్తరమైన వాంఛకి లొంగిపోయినందుకు సిగ్గుపడటం లేదు. ఈనాటికైనా నన్ను లొంగదీసే శక్తులున్నందుకూ, వాటిని ఆహ్వానించగల చైతన్యం నాలో ఇంకా అడుగంటనందుకూ గర్వపడుతున్నాను. దక్షిణపు గాలి పిలిస్తే మేఘం మెల్ల మెల్లగా కొంచెం కొంచెం కదిలిపోదు: అసలు మొత్తంగా కదిలిపోతుంది: ఎందుకు? ఏ మూలనో ఒక్క వర్షపు చుక్క అంటిపెట్టుకుంది. దాన్ని వదల్చుకునేందుకు కాదంటావా? నువ్వు నా పాలిటి దక్షిణపు గాలివి. నాలో వున్న బరువునీ, మొద్దుతనాన్నీ నువ్వు తొలగిస్తేనేకాని నేను రాణించను. నేనొక పసిపాపనైతే, నా జన్మ నక్షత్రం నువ్వు...."

ఈ ఉత్తరం ఎల్లా ముగించాలో రామ్మూర్తికి తెలియలేదు. ఇది ఉత్తరం కాదు. ప్రేమతత్వాన్ని గురించిన వొక గ్రంథంగా తయారవు

తోంది. ఉత్తరాలతో తృప్తి చెందే యౌవ్వనపు ఆవేశం రామ్మూర్తిలో లేదు. మనస్సులో యధార్థాలు, అసత్యాలు, ఊహలు, నమ్మకాలు, తాత్కాలికావేశాలు, శాశ్వతానురాగాలు మెరుపుల్లా తరుముకుంటూ, మాటల్లో బంధించబడడానికి వ్యవధి లేకుండా మాయమౌతుంటాయి — ఆకులు, ఫలాలు రాలిపోయిన మోడులాగుంది అతని మనస్సు. పిట్టలు వేసిన రెట్టలా మీదనే కొత్త చిగుళ్ళు!

"ఇది నిజం"—'ఇది నేను'— అని పాపం పురుషుడు మేఘాన్ని పట్టుకుని చూపిస్తాడు— అక్కడేమీ వుండదు— అని స్త్రీకి తెలుసు. ఆమె చేతుల్లో పడింది వర్షపుచుక్క. అతనికద్ది తెలీదు. అతనింకా మేఘం కేసి చూపుతుంటాడు. ఆమె నవ్వక చేసేదేముంది? ఆ నవ్వే స్త్రీలో నిగూఢత్వానికి ప్రతిధ్వని.

మొర్నాడు శాంత ఈ ఉత్తరం చదువుకొని నవ్వింది. భర్త రహస్యంగా వ్రాస్తుంటే తను ప్రక్కనే కూర్చుని చూసినదానికిమల్లే....

"ఇక్కడో ఉత్తరం ఉండాలి— చూశావా?" అన్నాడు రామ్మూర్తి.

"ఎక్కడ?"

"ఇక్కడ" అని డ్రాయరుకేసి చూపించాడు.

"ఇదేనా?" అని ఉత్తరం తీసుకొచ్చింది శాంత.

"ఎక్కడ దొరికింది?"

"దొరకడాని కేముంది? మండువా కడుగుదామని వెడితే అక్కడ పడివుంది."

"చూశావా లోపల?"

తల పంకించి శాంత వంటింట్లో కెళ్ళింది. అక్కడ ఆవిడ నవ్వినట్లు రామ్మూర్తి కనుమానం కలిగింది.

వారం గడిచాక, శాంత పినతల్లి పురిటికి తీసుకెళ్ళడాని కొచ్చింది. శాంత, పిల్లలు ప్రయాణమయ్యారు. రామ్మూర్తి స్టేషన్ కెళ్ళాడు సాగనంప

డానికి. రైలు కదలడానికి మరో పదినిమిషాలుంది. రామ్మూర్తి అనేకసార్లు ఏదో అడుగుదామని గొంతు సవరించుకొని చేతులు నలుపుకున్నాడు. ఆఖరికి శాంతే మాట్లాడింది.

"చాకలిపద్దు దానుగాణ్ణి చూడమనండి. ఇంకా రెండు తువ్వాళ్ళు, ఒక చీర అట్టే పెట్టుకున్నాడు. ఆరున్నర, పైన అణా కూడా యివ్వ కండేం? ధోవతులన్నీ చించి తీసుకొచ్చాడు."

"సర్లెద్దూ, సోది" అని రామ్మూర్తి నవ్వుతూ విసుక్కున్నాడు. రైలు కదిలింది.

"బైట కెళ్ళేటప్పుడు దొడ్డిగుమ్మం గడియవేసి మరీ వెడుతుండం డేం—" అంటోంది శాంత. భర్తకేసి భక్తి పూర్వకంగా చూస్తూ, కారుణ్యంతో నవ్వుతూ. ఆ నవ్వులో అనూయకత్వమో, అల్లరితనమో ఏది ప్రబలంగా వుందో రామ్మూర్తి నిర్ణయించలేకపొయ్యాడు.

ఆ రాత్రంతా రామ్మూర్తికి నిద్రలేదు. చిన్నతనం, సిగ్గు, వోమాదిరి విడియం అతన్ని ఆవరించాయి. ఉత్తరాలన్నీ మళ్ళా సావధానంగా చదువుకున్నాడు. ప్రియభారతి వ్రాసినట్లు తను రాసిన ఉత్తరాల్లో స్త్రీ దస్తూరి అనుకరించినా, శైలిలో దొరికిపొయ్యానా అన్న సందేహం వొచ్చింది. స్త్రీలభావాలు, శైలి అల్లా ఉంటయ్యా? సంస్కారంగల స్త్రీ అల్లా ఎందుకు వ్రాయకూడదూ? ఈ విషయాలని స్త్రీలు ఆరో ఇంద్రియం ద్వారా పసికట్టేస్తారు. మొత్తానికి ఆ ఉత్తరాలన్నీ భర్త వ్రాసినవేనని శాంత పసికట్టేసింది. అదీ అతని తలవొంపుకి కారణం.

శాంత తెలుసుకున్నా తెలియనట్టుగా నటించి, వాదానికి దిగి, కాస్త అసూయ ప్రకటింపవొచ్చుగా. సంసారం జీవితాన్ని మధురం చెయ్య టానికి ప్రేమ, ద్వేషాలకి సమాన శక్తి ఉంది. అందుకనే భార్యాభర్తల కొట్లాటలు, పుస్తకాల్లో నాయికలా విరుచుకుపడాలి. నాటకం ఆడాలి. ప్రియభారతి ఉత్తరాలగాధ భర్తతో తగాదానికి కూడా తగనంతటి అల్ప మైన దానికింద జమకట్టేసింది శాంత. అదీ అతని సిగ్గుకు కారణం.

ఏ స్త్రీ తన భర్తను ప్రేమించిందంటే, శాంత నమ్మలేకుండా వుందన్నమాటేగా! ఎంతవరకూ తన భర్త స్త్రీల ప్రేమకి పాత్రుడో, అర్హుడో అని తేల్చుకున్నట్లేగా! దాన్నిబట్టి తనని గురించి ఆమెకి ప్రేమైక జీవిత విషయంలో ఎట్లాంటి అభిప్రాయం వుందో ఊహిస్తే కలిగే ఫలితం విడియం.

ఏ స్త్రీ కూడా అతన్ని ప్రేమించదూ? ఋజువు చెయ్యడానికి సంకల్పించాడు. తనని గురించిన నిజాన్ని తనే ఋజువు చేసుకోడం మానవుని కడసారి ఆశయం. సత్యాన్వేషణ సాహసంతో కూడిన పని. అందులో మజా వుంది. ఈ సాహసం వ్యక్తిత్వ ప్రకర్ష. అది సంఘంలో స్థిరత్వాన్ని, వెనుక చూపునీ, మందగమనాన్ని ధిక్కరించి రభసచేస్తుంది. ఆ ఉద్రేకాన్ని అరికట్టడమే ప్రభుత్వాలు చేస్తున్న పని. ప్రజాస్వామ్య ప్రభుత్వాలకి పెద్ద సమస్య.

మతము, నీతి, ఆర్థిక స్వాతంత్ర్యము, ప్రాణంపై తీపి, ఇవన్నీ పరస్పరానికి, అన్యోన్యానికి పురిగొల్పుతాయి. కాని ఆదిమ నివాసులు, మన పూర్వులిచ్చిన ద్వేషపూరితమైన ఉద్రేకాలు, 'నిరంతరపోరాటం జీవుల ప్రకృతి శాసనం' అన్నభావం—అందరూ వొకర్నివొకరు ప్రేమించుకుంటే ద్వేషించేటందు కెవ్వరూ వుండ'రన్న చైతన్యం—ఇవన్నీ వ్యతిరేకంగా ప్రబోధిస్తాయి. మానవ సౌభ్రాతృత్వం కొనసాగాలంటే, ఈ ప్రాచీనతత్వాలకీ, ద్వేషాలకీ, ఉద్రేకాలకీ, బైటపడే అవకాశాలను కల్పించి, అరికట్టే మార్గాలని సమాజం ఆలోచించాలి. నేడు రాజకీయ వేత్తలకీ, ఫిలింతారాలకీ ఇట్లాంటి 'మజా' అనుభవాలు లభిస్తున్నాయి. రామ్మూర్తి ఈ అనుభవాన్ని పొంది. తనని గురించిన నిజాన్ని ఋజువు చేసుకోడానికి సమకట్టి పూరంట తిరగడం సాగించాడు. ఉత్తరాలు, ఊహించుకున్న అనుభవం చాలవు. రక్తమాంసాలతో సజీవమైన వ్యక్తిపై తన అంతరంగికాన్ని పరిశోధించుకోవాలి.

ఎవరిని ప్రేమించడం? తనని ప్రేమించేటందుకు భర్త వున్న స్త్రీ కూడా సిద్ధంగా వుండదు. ఒకవేళ ఉన్నా, భర్తతో తగవులాట, సంఘంలో తలవొంపు తప్పదు. అంచేత సంసారం పితలాటంలేని, కన్యకోసం గాలించసాగాడు. బాంక్ వీధి చివర్లో ఎవరిదో మేడ. మేడమీద గది. గదిముందు బాల్కానీ వుంది. ఆ బాల్కానీలో కుర్చీమీద కూర్చుని, వీధిలో వచ్చేపొయ్యేవాళ్ళని చూస్తూ కూర్చుంది. ఆమె ఎవరో! అంత మరీ చిన్నది కాదు. ఇరవైయ్యేళ్ళుండొచ్చు. పాతిక లోపే. తను ఆ వీధమ్మట నడచిన నాలుగురోజులూ అల్లానే కూర్చుంది. అతనికేసి చూసింది కూడా. వెడల్పాంటి గుండ్రని మొహం—అతనికి కోలమొహం ఇష్టం, కాని ఏం చెయ్యడం? పెద్దకళ్ళు, మబ్బు విడిచిన ఆకాశంలా నిర్మల మైన శరీచ్ఛాయ—జడలో రంగు రంగుల పూలు—ఆకుపచ్చరంగు చీర. వయ్యారమైన చీరమడతలు. అతను ప్రేమింపదగ్గదే అన్నివిధాలా.

పాశ్చాత్య దేశాలలో నడివయస్సులో వున్న పెద్దమనుష్యులు, పని మనిషితో లేచిపోవడం మామూలే. అది మోటు వ్యవహారం. అందులో సంస్కారం, అందం, వ్యక్తి గౌరవం లేవు. అయినా రామ్మూర్తికి కావల సింది మానసిక చైతన్యంగాని, భౌతిక తృప్తి కాదు.

ఆమెకి వివాహమైందో లేదో తెలుసుకోడం ఎట్లా? పోస్టు బంట్రోతు నడిగితే? వాళ్ళకి బట్టలుతికే చాకలాణ్ణి అడిగితే? స్కూలు పిల్లలు ఇండ్లకి చేరుకుంటున్నారు. ఇద్దరు కుర్రాళ్ళు, ఓ ఆడపిల్ల ఆ మేడ లోకే వెళ్ళారు. వాళ్ళని బుజ్జగించి మెల్లిగా ఆరాతియ్యాలి.

నాలుగురోజులైం తర్వాత, అవకాశం చిక్కింది. ఆ కుర్రాళ్ళకి చాక్లెట్లు, పిప్పరమెంట్లు పెట్టి, మెల్లిగా వాళ్ళతో కబుర్లు సాగించి, స్కూలువరకు నడిచివెళ్ళి ఆరాతీశాడు. పెండ్లి కాలేదు అమ్మయ్య! అను కున్నాడు. ఇంకా ఎందుకు కాలేదో, ఆమె వాళ్ళ కేమవుతుందో యివన్నీ అడిగాడు. కాని వాళ్ళు సరైన సమాధానం యివ్వలేదు. రోజూ ఆ వీధంట

వెడుతుండేవాడు. ఆ అమ్మాయి అల్లా తనకేసివీధి మళ్ళేవరకూ చూస్తూనే ఉన్నట్లుండేది.

రామ్మూర్తి మనస్సు ఉండబట్టలేకపొయ్యాడు. ఆమెతో మాట్లాడి అడిగెయ్యడానికి నిశ్చయించుకున్నాడు. తీరా వ్యవహారం బెసిగిపోయి, నలుగుర్లోనూ పడితే ఏం చెప్పడం? నేనో నవల వ్రాస్తున్నాను. అందులో ఒక పాత్ర ప్రవర్తన ఎంతవరకూ జీవితాన్ని అనుసరించి ఉందో నిర్ధారణ చేసుకోడానికి అలా చేశాను—అనొచ్చు. అట్లాగంటే నమ్ముతారా? నలభై యేళ్ళ పెద్దమనిషి, గౌరవ కుటుంబీకుడు, పౌరుడు, మరో ఉద్దేశంతో అల్లా చేస్తాడనుకుంటే, మన సంఘం నేడు ఎంతటి దుర్దశలో వుందో విశదమవుతుంది. అట్లాంటి సంఘానికి తనకి విలువకట్టి, తీర్పు చెప్పే అధికారం లేదు; ఉండకూడదు.

ఆమెతో ఏమనాలో ముందుగా ఓ కాగితంమీద వ్రాసుకున్నాడు. రకరకాలుగా వ్రాసి చూశాడు. అతనికి ఆఖరికి నచ్చింది ఇల్లా ఉంది.

"నువ్వెవరవో నాకు తెలీదు. ఐనా నాకు సన్నిహితురాలవే. మనకి వెనకటి జన్మలో బాంధవ్యం ఏర్పడి ఉంటుంది నేను నిన్ను కోరుతున్నాను. నీకు భర్త పిల్లలు వున్నా కోరి ఉంమను. నాకు ఉన్నారు. తెగించి సాహసిస్తేగాని ప్రేమకి విలువలేదు. నువ్వంగీకరిస్తే, మనది మహోన్నతపు జీవిత మవుతుంది. నిరాకరిస్తే భగ్నజీవినై, పిచ్చివాడినై చెడిపోతాను. పాపాలు, ఘోరాలు చేస్తాను. మరో ప్రపంచ సంగ్రామానికి నేను కారకుణ్ణి అవొచ్చు.

ప్రేమ దాస్యం కోరడంలేదు. సంసారంనుండి విమోచన కోరుతున్నాను. నీ స్పర్శకి పంజరం కడ్డీలు వూడి, అందులోంచి పిట్టలాగ ఆత్మ ఆధ్యాత్మిక సీమలో కెగిరిపోతుంది. ఆత్మ విముక్తి గీతాసారం.

ప్రేమలేని ఆత్మకి విలువలేదు. ఆత్మలేని ప్రేమ పెండ్లి. రెంటినీ ఇవ్వాలి నువ్వు.

తర్వాత నిన్ను త్యజిస్తానని భయమా? మంచి చెడ్డలు, ముందు వెనుకలు, జమాఖర్చులతో నిమిత్తం లేనిది మహోజ్వల ప్రేమ. అందులో నశింపవుతాను. ఒక్క సమిధె నువ్వు సమర్పించాలి.

నాకేం కావాలో నిన్ను కలుసుకున్నంతవరకూ తెలిసింది కాదు. తెలుసుకునేటందుకు నలభై సంవత్సరాలు పట్టింది.

ఇవీ అతను అనదలచుకున్న ముక్కలు. కంఠస్థం చేసుకున్నాడు. సందర్భానుసారంగా అవతలవ్యక్తి చెప్పే వాక్యాలను వూహించి, వాటి కనువైన సమాధానాలను కూడా అనుకున్నాడు.

తనని గురించిన నిజం ఆ వాక్యాలలో ఎక్కడో ఉందనిపించింది రామ్మూర్తికి. ఎందులోనో తెలియడంలేదు. తేల్చుకోక తప్పదు.

మాట్లాడేటందుకు తగిన ధైర్యం పురస్కరించుకునేప్పటికి, మరో పదిరోజులు గడిచాయి. ఆ రోజున విద్యాధికారి స్కూలు తనిఖీ వుంది. పొద్దోయింతర్వాతగాని పిల్లలు యిళ్ళకి రారు. ఆ యింట్లోంచి ఒకామె బైటకొచ్చి వీధమ్మట నడుస్తూ వెళ్ళింది.

సాయంత్రం ఆరు దాటింది. సూర్యుడు పడమటి ఆకాశంలో అవు లిస్తూ మంచంమీద నిద్రకి కూలబడినట్లు దిగుతున్నాడు. దిగిపొయ్యాడు, ఎర్రశాలువా కప్పుకుని. సంధ్యలో మేఘాలవెనక మొదటి నక్షత్రం తళుక్కుమనగానే రామ్మూర్తి తలుపుతోసి లోనికి ప్రవేశించాడు. తను వొంటిగా ఉండటం — చీకటి — ఈ రెండూ కొత్త ఉత్సాహాన్నీ, తెగింపునీ యిచ్చాయి అతనికి. హాల్లో మూలగా మేడమీదికి మెట్లున్నాయి. గబ గబ ఎక్కి బాల్కనీలోనికి చేరుకున్నాడు. ఆ అమ్మాయి కుర్చీలో కూర్చుని ఉంది. లేవలేదు. అతను నిలబడాల్సి వొచ్చింది. వెనకాల గదిలో కుర్చీ తెచ్చుకుని కూర్చుంటే? వ్యవధి లేదు. మళ్లా ఎవళ్ళైనా రావొచ్చు. ఇందాక వెళ్ళినావిడ అప్పుడే రాదు కదా! కంఠస్థం చేసుకున్న వాక్యాలు చదవడం మొదలెట్టాడు. ఆమె కళ్ళల్లోకి తీవ్రంగా చూస్తూ, ఉద్రేకపు తీవ్రతలో కొన్ని వాక్యాలు వొదిలేశాడు.

"నీకు భర్త, పిల్లలు వున్నా కోరి వుందును, నాకు వున్నారు."

"సంసారంనుండి విముక్తి కోరుతున్నాను."

"తర్వాత నిన్ను త్యజిస్తానని భయమా ?"

"తెలుసుకునేందుకు నలభై సంవత్సరాలు పట్టింది...." అవి రామ్మూర్తి వొదిలేసిన వాక్యాలు. గడియారంకేసి చూసుకున్నాడు. రెండు మూడు నిమిషాలు పట్టిందేమో !

సమాధానం కోసం ఎదురుచూస్తూ నిలబడ్డాడు. ఆమె ఏమీ మాట్లాడ లేదు. చీరకొంగు వేళ్ళకి చుట్టుకుంటూ వింతగా నవ్వుతూ కూర్చుంది. రెండుమార్లు లేవబోయి కూర్చుంది.

"చెప్పవూ ?"

ఆమె మాట్లాడలేదు.

"తొందర్లేదు. ఆలోచించుకుని చెప్పు. రేపీపాటికి వొస్తాను."

ఆమె జడ సర్దుకుంది. తల్లో పూలు కిందపడ్డాయి. అతను తీసి ఆమె చేతి కిచ్చాడు.

"మళ్ళా రేపొస్తాను. వెళ్ళిరానా !"

ఏమీ సమాధానం లేదు.

రామ్మూర్తి మెట్లు తొందరగా దిగి హాల్లోకి చేరుకున్నాడు. వెనక ఎవరో కదిలినట్లనిపించింది. మెట్లకింద తలుపుకేసి చూశాడు.

హాల్లో తలుపు వెనకాల నిలబడి వుంది. ఆమె యిందాక వెళ్ళి నామెలా ఉంది. తను రాగానే ఆ తలుపు వేసి వుండకూడదూ ? సన్నటి దీపం వెలుగులో బాగా కనబళ్ళేదు.

"నే నంతా విన్నానండి బాబూ ! మా అక్కయ్య కూతురే. మీ కెవరేనా తమ్ముళ్ళుగాని, మొగపిల్లలు ఉండి పెళ్ళి చేసుకుంటే మా క్కావలసిం దేముంది ? ఏం చెయ్యం, దాని కర్మ ! పెండ్లి కావడంలేదు. మూగపిల్ల. మీ ఎరికలో ఎవరేనా ఉంటే చూడ్డురు బాబు !" అన్న దామె.

రామ్మూర్తి ఎట్లాగో శ్వాస తీసుకుని వీధిలోకి ఊడిపడ్డాడు. ఉద్యోగం కోసం మొదటి ఇంటర్వ్యూకి వెళ్ళిననాటిమల్లే, కాళ్ళు చేతులు తిమ్మెర్లెక్కి, వొళ్ళంతా చెమట్లు పోశాయి. విశ్వమంతా తన చుట్టూ కూలి పడితే అట్లా గుంటుంది కాబోలు.

లాఠీదెబ్బలకీ, కత్తిపోట్లకీ, తుపాకిగుండ్లకి బలి కావడానికి శరీరం సిద్ధపడుతుంది. అహం ఒక్క-మాటతో మూర్ఛిల్లుతుంది. ముసలామె చేసిన తీర్పు — జన్మాంతరశిక్ష. మూగపిల్లకి కూడా తను తగడు. తన ఎరికలో ఎవరేనా వుంటే చూడాలిట! అంతకంటే ఉరికంబం మేలు.

స్వార్థం గాయపడినప్పుడు బుద్ధి స్తంభిస్తుంది. ఊహ భీభత్సంగా తయారవుతుంది. ఉద్యోగానికి రాజీనామా ఇవ్వాలనిపించింది. ప్రపంచ మంతా ఒక కాలిమీద గెంతుకుంటూ చుట్టి రావాలనిపించింది. సన్యాసం పుచ్చుకోవాలనిపించింది. ఎవరినో హత్య చెయ్యాలనిపించింది. దీని కంతకీ బాధ్యురాలు శాంత. తనచేత కూలివాడి మాదిరి వెట్టిచాకిరీ చేయించుకుని, శక్తుల్ని ధ్వంసంచేసి, వార్ధక్యం వప్పగించి, తను పిల్లలతో హాయిగా పురిటి మంచంలో కులుకుతోంది. స్త్రీకి బాధ్యతలే లేవు. పిల్లల్ని కనడం ఆమె హక్కు. వాళ్ళకి అన్నం పెట్టడం మొగాడి బాధ్యత. తను పట్టుచీర సింగా రించుకుని పేరంటానికెళ్ళడం ఆమె హక్కు. సంతానాన్ని తోడేలు ఎత్తుకుపోకుండా కాపలా వెయ్యడం వీడిబాధ్యత. హక్కులు, బాధ్యతలు.... ఈ బాధ్యతలూ, హక్కులు అనే మాటలు పదేళ్ళవరకూ ఏ పత్రికా వాడ కూడదని ఐక్యరాజ్యసమితి శాసిస్తే బావుండును. ఇంటికి చేరుకున్నాడు రామ్మూర్తి. గుమ్మంలో పోస్టుబంట్రోతు సైకిల్ దిగి టెలిగ్రాం అన్నాడు. ప్రసవించి, శాంత మరణించిందన్న వార్తా!

శాంత పినతండ్రి పంపిన టెలిగ్రాం అది. నొప్పులు ప్రారంభ

మయ్యాయనీ, ఆ సమయంలో తను దగ్గర వుండడం అవసరం గనుక తక్షణం బైలుదేరి రమ్మనీ—ఉంది.

రామ్మూర్తి మెట్లమీద వాలిపోయ్యాడు. శాంతలేని సంసారం ఊహించలేకపోయ్యాడు. తన కీనాడు జరిగిన పరాభవాన్నుండి తేల్చగల శక్తి మరింకెవరి కుంది? ఆమె దగ్గర తను దాచలేడు. చెప్పకపోయినా ఆమె ఎట్లాగో తెలుసుకుంటుంది. తనకి విషాదంగా తోచిన వాటిని నవ్వి పారేస్తుంది. తన కప్రస్తుతమని తోచిన చాకలిపద్దు విషయం ఎంతో పట్టింపు చేస్తుంది. చిత్రమైన మనిషి. వారి అన్యోన్యానికి కారణం ప్రేమా? కాదు, అదేమిటో అతనికి తెలీదు. ప్రేమను గురించి ఆమె ఎప్పుడూ ముచ్చటించలేదు. ఉత్తరాల్లో వ్రాయలేదు. ఆమెతో మాట్లాడేందుకు ఏవీ కనుపించవు. ఆమె వుంటుంది. లేకపోతే తన జీవితంలో ఏదీ చొరలేని ఖాళీ ఏర్పడుతుంది. ఆమె మరణం అనూహ్యం. భాషా భావాలు లేకుండా వాతావరణంపై ఒత్తిడి కలిగించి పరివర్తన తీసుకురాగల కవయిత్రి ఆ ఇల్లాలు, శాంత.

ప్రయాణమయ్యాడు. రైల్లో ఎన్నో ఆలోచనలు; తన వివాహం; కొత్తలో శాంత సిగ్గు; చీరకొంగులో నవ్విన దృశ్యం, వికృతంగా అవులించడం — ఆమె వికృతంలో, అల్పత్వంలో సౌందర్యం ఉంది.

తనో?

తనని గురించిన నిజం, మూగపిల్ల ముందు కంఠస్థంచేసి చెప్పిన ఉపన్యాసంలో, వొదిలేసిన వాక్యాల్లో ఉంది. అప్రయత్నంగా వాటిని విడిచిపెట్టినట్లా, లేక కావాలని వొదిలేసినట్లా?

తెల్లవారింది.

కొంత దూరం బండిమీద ప్రయాణం చెయ్యాలి.

ఇంటికి చేరుకునేటప్పటికి, సాయంత్రం ఏడుగంటలు కావస్తోంది. శాంత పినతండ్రి కలుసుకున్నాడు గుమ్మంలో.

"అమ్మాయి పొద్దుంది. నేనే ఇచ్చా టెలిగ్రాం, ఎందుకేనా మంచి దని. నిన్ననే ప్రసవించింది. తల్లి, పిల్ల క్షేమంగానే ఉన్నారు. ఏమీ ఎక్కువ కష్టపడలేదు. పైవాళ్ళ ఆదుర్దా...."

"ఆడపిల్లా" అన్నాడు రామ్మూర్తి.

చూడొచ్చు నన్నారు. తొందరగా గదిలో కెళ్ళాడు. అంతా నిశ్శబ్దం. వెన్నెల్లో వాస్తువులన్నీ తెల్లటిపొర కప్పుకున్నట్లుంది. ఇంటి కప్పుమీద నుంచి జారిన వెన్నెల వెలుగు శాంత నుదుటిమీద గీతలా పడుతూంది. ఆనాడు సౌందర్యం తన యాత్ర ముగించుకుని పవ్వళించింది. ప్రక్కనున్న "సత్యం" అనే పాపని జోకొడుతోంది.

శాంత నీరసంగా నవ్వింది. పాపకేసి చూపించింది.

దీపం పెద్దదిచేసి చూశాడు. అతను నమ్మలేకపోయాడు. భ్రమా? నిజమా? నవ్వుకి శాంత మూతి వొంకరయింది. నిశ్చలంగా అతని కళ్ళ ల్లోకి చూసింది. గాలికి లేచిన నురగలో స్వచ్ఛత, తుఫాను ముగిసిన తర్వాత కొండ శిఖరాల నిశ్చలత్వం, భూకంపం అనంతరం శిథిలాల ఏకాగ్రత, సంద్రాల నడిగుహలో తిమింగలం నిద్రపోయిన తర్వాత మిగిలిన నిర్మలత్వం, సూర్యకిరణం తాకిడికి మత్తెక్కి వికసించలేని ఉదయపు మొగ్గలోని మూగబాధ—అన్నీ ఉన్నాయి ఆ చూపులో.

రామ్మూర్తి జీవితంలో సత్యాన్ని ఎదుర్కొన్న వానివలే హాడికి పోయ్యాడు. చెప్పేటందుకు ఏముంది? వెనక్కి తిరిగాడు.

"మాట" అంది శాంత మెల్లగా నిలబడ్డాడు. దగ్గరకు రమ్మని సంజ్ఞ చేసింది

"మావాళ్ళకి తొందర. నాతో చెప్పకుండా టెలిగ్రాం ఇచ్చారు" అంది.

"దానికేం, మంచిపనే చేశారు. నాకూ చూడాలనుంది" అన్నాడు రామ్మూర్తి.

"ఇదుగో" అని — ఏదో అనబోయింది.

"ఏం ?

"ఏమీలేదులెండి" శాంత పక్కగా తిరిగి పడుకుని దుప్పటి రొమ్ము పైకి లాక్కుంది.

రామ్మూర్తి వీధిలోకి వొచ్చేసి అరుగుమీద కూర్చుని చంద్రుడికేసి చూస్తూ పదినిమిషాలు గడిపాడు. రెండోవాడు "పేతు" వొచ్చి—

"ఇదుగో నాన్నా, ఏదో కాగితంట, అమ్మ నీ కివ్వమంద" అని కాగితం ఇచ్చాడు.

"మన స్వప్నం ఫలించింది. ఆడపిల్లకి "రామప్రియ" అని పేరు పెట్టుకుంటా. ఇంక మీరు మంచివారుగా ఉండనక్కర్లేదు.

మీ ప్రియభారతి.'

అనుంది అందులో.

రామ్మూర్తి అప్రయత్నంగా నవ్వేశాడు. గదిలోకెళ్ళి పాపకేసి చూశాడు. సందేహం లేదు. అంతా తన ఊహలో చిత్రించుకున్న ప్రియ భారతి పోలికే. ఆ కోలమొహం, సన్నటి తీర్చిన కళ్ళు, మధురంగా ముడుచుకున్న పెదవులు — అంతా ఆమే. బైటకి వొచ్చేశాడు.

అసంభవం. తను స్వప్నంలో బాధించుకున్న కవితా సతిఛాయల్ని తన భార్య నవమాసాలు మోసి, పెంచి కన్నదా ?

భ్రమ.

అవుతే భ్రమ నిజం. బైటకి రాగానే అతని కో అనుమానం తట్టింది. గబగబ గదివైపు నడిచాడు. తలుపు తొయ్యబోయాడు. పాప ఏడ్పు వినబడింది. 'అమ్మయ్య' అనుకున్నాడు.